నిన్నే చూడాలని...

నీతో మాట్లాడాలని...

కేసిఆర్‌ను చూడాలని చావుతో పోరాడుతున్న బాలుడి ఆరాటం.

ఎప్పుడు ఆగిపోతుందో తెలియని ఓ చిన్నారి హృదయం ముఖ్యమంత్రి కేసిఆర్ కోసం కొట్టుకుంటుంది. ఒక్కసారి కేసిఆర్ ను చూడాలని ఆ పసిప్రాయం పరితపిస్తోంది. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసిఆర్‌ను చూడటం మినహా తనకేమి కోరికలు లేవని ఆ లేత పెదాలు ఒక్కో మాటను కూడదీసుకొని చెబుతున్నాయి. కేసిఆర్‌తో మాట్లాడితే చాలు, ఇక తర్వాత ఎమైనా పరవాలేదు అని ఆయాస పడుతున్న గుండె తనను తానే సముదాయించుకుంటుంది.

ఆ పిల్లాడి పేరు కొండా శరత్. వయస్సు 11 సంవత్సరాలు. వరంగల్ జిల్లా నర్మెట్ట గ్రామం. పుట్టినప్పుడే గుండెకు సంబంధించిన వ్యాధితో వున్నాడు. చిన్నప్పటి నుండే శ్వాస తీసుకోవడం కష్టమైంది. ఎప్పుడు జ్వరంతో బాధపడేవాడు. శరీర రంగులో కూడా మార్పులు వచ్చేవి. దీంతో తల్లిదండ్రులు బాలయ్య, భార్య తల్లడిల్లి పోయారు. ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. చివరికి ఆ పిల్లాడికి సెప్టల్ డిఫెక్ట్ (**Septal defect**) వున్నట్లు తేలింది. వెంటనే గుండె ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. దీంతో 2005 లో పిల్లాడి వయస్సు మూడేళ్లు వున్నప్పుడు మొదటి సారి గుండెకు ఆపరేషన్ చేశారు. అప్పటి నుండి మందులతో నెట్టుకొస్తున్నారు. ఇటీవల మళ్లీ సమస్య వచ్చింది. తల్లిదండ్రులు మళ్లీ ఆ పిల్లాడినిహైదరాబాద్‌లోని ఆపోలో ఆసుపత్రికి తీసుకొచ్చారు. మళ్లీ ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. దీంతో కొద్ది రోజుల క్రితం మళ్లీ ఆపరేషన్ చేశారు. తాత్కాలికంగా ఆపరేషన్ చేసి నెట్టుకొస్తున్నాము తప్ప ఇప్పటికి బాలుడి పరిస్థితి పూర్తిగా మెరుగ్గా వుందని చెప్పలేమని డాక్టర్లు అంటున్నారు. మరో రెండు మూడు సార్లు ఆపరేషన్ చేయాల్సి రావచ్చని, అయినప్పటికి ఆ పిల్లాడికి వున్న జబ్బు పూర్తిగా నయమవుతుందనే విషయంలో నమ్మకం లేదని చెబుతున్నారు. డాక్టర్లు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు.

వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న పిల్లలను పరామార్శించడానికే నెలకొల్పిన మేక్ ఎ విష్ అనే అంతర్జాతీయ సంస్థ ప్రతినిధులు అపోలో ఆసుపత్రిలో శరత్‌ను కలిశారు. వైద్య చికిత్సల గురించి తెలుసుకున్నారు. సంస్థ ప్రతినిధి ప్రియ తులూరి ఆ బాబును నీకేమయిన కోరికలు వున్నాయా అని అడిగింది. అప్పుడు ఆ బాలుడు ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా తనకు కేసిఆర్‌ను చూడాలని వుందని చెప్పాడు. కేసిఆర్‌తో మాట్లాడటం ఎప్పటి నుంచో కోరికని వెల్లడించాడు. తాను ఆసుపత్రిలో వున్నప్పటికి కేసిఆర్‌ను చుడాలనే ఎప్పుడు ఆలోచిస్తానని ఆ బాలుడు వెల్లడించాడు. స్వంత గ్రామంలో టైలరింగ్ చేసే బాలుడి తండ్రి బాలయ్య కూడా తన కొడుకు ఎప్పుడూ కేసిఆర్ గురించే తపిస్తున్నాడని చెప్పారు. తమ గ్రామంలో తెలంగాణ ఉద్యమం ఉద్రుతంగా సాగేదని అప్పుడు తన కొడుకు అన్ని విషయాలను ఆసక్తిగా చూసేవాడని బాలయ్య చెప్పాడు. టివిలో కేసిఆర్ ఎప్పుడు కనిపించినా సంతోషించేవాడన్నాడు. ఆరోగ్యం బాగా లేక ఆసుపత్రిలో వున్నప్పటికి కేసిఆర్ గురించే ఆలోచిస్తున్నాడని వెల్లడించాడు. కేసిఆర్‌ను చూడాలనే బాలుడి కోరికను విన్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ బాలుడి కోరిక నెరవేరాలని ఆకాంక్షించారు.